ఇక సాఫీగా ప్రయాణం

● బస్‌డిపో రోడ్డులో డివైడర్ల తొలగింపు
● ప్రమాదాల నివారణపై అధికారుల దృష్టి


డివైడర్లను తొలగించిన దృశ్యం

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం బస్ డిపో రోడ్డులో మయూరిసెంటర్, బస్ డిపో రోడ్డు, డీఆర్‌డీఏ ఆఫీస్, రాపర్తి నగర్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన డివైడర్ల తొలగింపునకు అధికారులు ఎట్టకేలకు రంగంలోకి దిగారు. ఈ డివైడర్ల కారణంగా రోడ్డు ఇరుకుగా మారి డిపో నుంచి బస్సుల రాకపోకలతో రద్దీ పెరిగి ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులు, పత్రికల్లో ప్రచురితమైన కథనాలతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డివైడర్లను తొలగించేందుకు గత నెలలోనే నిర్ణయించినా అమలు కాలేదు. ఈ నేపథ్యాన విమర్శలు వస్తుండడంతో ఎట్టకేలకు సోమవారం డివైడర్ల తొలగింపునకు రంగంలోకి దిగారు. ఒకటి, రెండు రోజుల్లో వీధిలైట్లను తీసేయగానే డివైడర్లను తొలగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మూడేళ్లుగా తరచూ ప్రమాదాలు

డిపో రోడ్డులో డివైడర్లను ఏర్పాటు చేశాక ఇక్కడ రహదారి ఇరుకైంది. ఫలితంగా మూడేళ్ల నాటి నుంచి తరచూ మయూరిసెంటర్ నుంచి బస్ డిపో రోడ్డు, రాపర్తినగర్ బోర్డు వరకు తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ జరిగిన ప్రమాదాలతో పలువురు క్షతగాత్రులయ్యారు. దీంతో డివైడర్లను తొలగించాలని నిర్ణయించిన మున్సిపల్ అధికారులు పనులు మొదలుపెట్టారు.

మంత్రి తుమ్మల ఆదేశాలతో..

డివైడర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో తొలగించేందుకు చర్యలు చేపట్టారు. స్థానికులు తమ ఇక్కట్లు తీరనున్నాయని ఊపిరి పీల్చుకుంటున్నారు. కాగా, డివైడర్ల తొలగింపు కోసం దాదాపు రూ.3 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిసింది. తొలుత వీధిలైట్లు తీసేసి, ఆపై డివైడర్లను కూల్చివేసి అనంతరం వీధిలైట్లను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


ప్రొక్లెయిన్ సాయంతో స్తంభాల తొలగింపు..

కేఎంసీ గ్రీవెన్స్‌కు 58 వినతులు

● రెవెన్యూ విభాగానికే అధికం


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 58 మంది తమ సమస్యలపై అధికారులకు వినతులు అందజేశారు. వీరిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యలనే అధికారులకు ఏకరువు పెట్టారు. ఒకే ఇంటి నంబర్‌కు 8 అసెస్‌మెంట్ నంబర్లు నమోదయ్యాయని, ఇంటి పన్ను చెల్లించినా బకాయిలు ఉన్నాయంటూ కేఎంసీ నుండి ఫోన్ చేసి వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పేర్ల సవరణ, పన్నుల సవరణలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ మేళా నిర్వహించినా ఈ విభాగానికి సమస్యలతో కూడిన వినతులు పెద్ద సంఖ్యలో వస్తుండడం గమనార్హం. ఆ తర్వాత టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించాలని సంబంధిత అధికారులకు అందజేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ కేఎంసీ గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజలు అందించిన వినతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఏసీపీ వసుంధర్, ఆర్‌ఐ జ్యోతి, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఏఎస్‌వో లింగయ్య, సీనియర్ అకౌంటెంట్ సతీష్, టీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాల పొదరిల్లు ఫొటోగ్రఫీ


ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ కార్యవర్గంతో మేయర్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: జ్ఞాపకాల పొదరిల్లు ఫొటోగ్రఫీ అని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం సోమవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వై..హనుమంతరావు, కార్పొరేటర్ కమర్తపు మురళి, రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.హుస్సేన్, కోశాధికారి మాధవరెడ్డి, నాయకులు రాపర్తి శ్రీనివాస్ గౌడ్, కన్నెగుండ్ల అశోక్, నాగరాజు దేవర, ఎడిట్ పాయింట్ రమేష్, జిల్లా అధ్యక్షుడు మరగాని వెంకట్, పిన్ని కనకారావు, తిరుపతిరావు, కె.రఘు, కేఎస్ బాబా ఉన్నారు.

నేలకొండపల్లి: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారంలో జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్‌ను సంఘం మండల బాధ్యులు సన్మానించారు. మండల అసోసియేషన్ అధ్యక్షుడు గొలుసు ఆంజనేయులు, మండల కోశాధికారి వల్లాల ఉపేందర్, కమిటీ సభ్యులు చిర్రా సుబ్బారావు ఉన్నారు.

క్లుప్తంగా

శివరాత్రి వేడుకల పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కూసుమంచి: ఈనెల 25 నుండి 27 వరకు కూసుమంచిలోని శివాలయంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లపై సోమవారం ఆలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల పోస్టర్లను మాజీ పోలీస్ అధికారి, ఆలయ పునర్జీవ కర్త సాధు వీరప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, భక్తులందరికీ సులభంగా దర్శనమయ్యేలా ఏర్పాట్లు ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఆలయ ఈఓ శ్రీకాంత్, చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సై నాగరాజు, గ్రామ కార్యదర్శి నీరజ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' పనులపై ఓపెన్ ఫోరం

రఘునాథపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని 40 పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు చేసిన తనిఖీలపై ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2023 నుండి 2024 మార్చి 31 వరకు పనులకు సంబంధించి పనులపై ఫోరం జరుగుతుందని తెలిపారు. తనిఖీ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులు, సమస్యలపై పంచాయతీల వారీగా చర్చిస్తామని పేర్కొన్నారు. ఉపాధి హామీపథకం సిబ్బందితో పాటు, అన్ని విభాగాల అధికారులు సభకు హాజరుకావాలని కోరారు.

వేతనాలు చెల్లించాలి

నేలకొండపల్లి: స్థానిక సీహెచ్‌సీ సిబ్బంది వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, సిబ్బంది మాధవి, వెంకన్న, సైదా, కమలమ్మ, సుజాత, అనిత పాల్గొన్నారు.

నివాళి

తిరుమలాయపాలెం: కొక్కిరేణి మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధురాలు చావా సుగుణమ్మ సోమవారం మృతిచెందగా కొక్కిరేణి గ్రామంలో పలువురు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, భాగం హేమంతరావు, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, సొసైటీ చైర్మన్ చావా వేణు, సీపీఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, బెల్లం రాము, కర్నాటి రాజేందర్ ప్రసాద్, సిరిగద్దె ఉపేందర్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

రామనామ సంకీర్తనకు భక్తబృందం

కామేపల్లి: కామేపల్లికి చెందిన అవధూతేంద్ర భక్త మండలి ఆధ్వర్యాన ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన అయోధ్య రామ మందిరంలో ఏడు రోజులపాటు హరే రామ నామ సంకీర్తన సప్తహం నిర్వహించే అవకాశం దక్కిందని భక్తమండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ తెలిపారు. ఆయన నేతృత్వంలో సుమారు వంద మంది హరే రామ నామ సంకీర్తన రామాయణ ప్రవచనం, హనుమాన్ చాలీసా పారాయణం సోమవారం ప్రారంభించారు. కేశగాని నాగయ్య, బండి శ్రీనివాస్, రఘుకుమార్, వనం సూర్యప్రకాశ్, సాయికుమార్, మనోజ్, మేకల నాగేశ్, తిరుపతయ్య, శైలజ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంరూరల్: పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఆరెంపుల గ్రామంలోని అర్హులందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి గ్రామ కార్యదర్శి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామశాఖ కార్యదర్శి సీతారామిరెడ్డి, నాయకులు తిరపయ్య, మౌలానా, లాలు, కిషోర్, గోపి పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	డాకు మహారాజ్
ఆదిత్య	గేమ్ చేంజర్
శ్రీనివాస	డాకు మహారాజ్
సినీ గెలాక్సీ	ఏజెంట్ గై 001

\- ఖమ్మం గాంధీచౌక్

పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి..


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కామేపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ అజ్మీరా రాందాస్‌నాయక్, అర్జున్, భూక్యా సీతారాములు, దొడ్డిగర్ల సుందరం పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలి

కామేపల్లి: విద్యుత్ శాఖ ఉద్యోగులపై పని భారం ఎక్కువగా ఉందని, నియామకాలు చేపట్టి పని ఒత్తిడిని తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 (ఐఎన్‌టీయూసీ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని కొత్తలింగాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం ఖమ్మం డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఆర్టిజన్లకు ఏపీ ఎస్‌ఈబీ రూల్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రైతుల సంక్షేమ కమీషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, రామారావు, దావూద్, యుగేందర్, నాగేంద్రకుమార్, సత్యనారాయణ, సీతారాం గోపాల్ పాల్గొన్నారు.

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న ఆలయ కమిటీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్పొరేటర్ నాగగండ్ల కోటి మాట్లాడుతూ... ప్రతీ సోమవారం నిరంతరాయంగా అన్నదానం కొనసాగిస్తామన్నారు.

పలుచోట్ల సేవా కార్యక్రమాలు


బియ్యం, పండ్లు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/కామేపల్లి/ఖమ్మం రూరల్/నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో కులసంఘాలు, కాంగ్రెస్ నాయకులు యలమందల జగదీష్, చల్లా కృష్ణ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. కొంగర జ్యోతిర్మయి, బోడా శ్రావణ్‌కుమార్, భూక్యా సురేష్, తేజావత్ పంతులు నాయక్ తదితరుల ఆధ్వర్యాన అమ్మ ఆశ్రమంలో అన్నదానం చేయగా, మేఫి మానసిక దివ్యాంగుల కేంద్రానికి బియ్యం, పండ్లు అందజేశారు. అలాగే, కామేపల్లి మండలం పండితాపురంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు చేపట్టగా దయాకర్‌రెడ్డిని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు సన్మానించారు.

హద్దురాళ్లను తొలగించండి

ఖమ్మం అర్బన్: మండలంలోని మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 315, 317 ఉన్న 23 ఎకరాల 22 గుంటలు భూమిలో అక్రమంగా పాతిన హద్దురాళ్ల రెండు రోజుల్లో తొలగించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'స్టేటస్ కో' ఉండగా రాళ్లు పాతారాని, రాళ్లు తొలగించని పక్షంలో వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సత్యనారాయణ, రవిమారుత్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యా విధానం అవసరమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో హార్వెస్ట్ టెండర్ రూట్స్ 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిలర్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, కరస్పాండెంట్ పి.రవిమారుత్, క్వెస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వై.నాగమణి, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు అలరించగా, పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. టెండర్ రూట్స్ హెచ్‌ఎం నసీమా, అకడమిక్ ఇన్‌చార్జ్ ఉషశ్రీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

చెస్‌లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: నగరంలోని మమతా రోడ్డులో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి అక్షజ్‌కుమార్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరిచాడని పాఠశాల డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అండర్-9 బొడిగ బాలయ్య చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థి ప్రథమస్థానంలో నిలిచి ప్రశంసాపత్రం, ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పలువురు విద్యార్థిని అభినందించారు.

కరాటేలో..


గ్రాండ్ చాంపియన్‌గా నిలిచిన సందీప్

ఖమ్మం స్పోర్ట్స్: వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఖమ్మంలోని గోపతి సైదులు కరాటే స్కూల్ విద్యార్థి బి.సందీప్ గ్రాండ్ చాంపియన్‌గా నిలిచాడు. కటాస్ స్కానింగ్‌లలో తన ప్రతిభను ప్రదర్శించి వ్యక్తిగత బహుమతులను తగ్గించుకోవడంతో పాటు చాంపియన్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పలువురు అతన్ని అభినందించారు.

శ్రీపాల్‌రెడ్డి నామినేషన్‌కు తరలిన ఉపాధ్యాయులు

ఖమ్మంసహకారనగర్: నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా జిల్లా నుంచి పీఆర్‌టీయూ నాయకులు సోమవారం తరలివెళ్లారు. జిల్లా నలుమూలల నుంచి 300 మంది ఉపాధ్యాయులు వెళ్లి అక్కడ జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రంగారావు, మాజీ జిల్లా అధ్యక్షులు మోతుకూరు మధు, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఇరుముడి కార్యక్రమం


కూసుమంచిలో..


నేలకొండపల్లిలో..

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామంలో సోమవారం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి మాలధారుల ఇరుముడి కార్యక్రమం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. గురుస్వామి లగ్గిశెట్టి వీరబాబు దీక్షాపరులకు ఇరుముడులను కట్టగా అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి పెనుగంచిప్రోలు బయలుదేరి వెళ్లారు. కాగా గ్రామానికి చెందిన గురుస్వామి లగ్గిశెట్టి వీరబాబు 28 ఏళ్ల నుంచి తిరుపతమ్మ మాలధారణ చేసస్తూ దీక్షా పరులకు ఇరుముడులు కడుతున్నారు.

కామేపల్లి: మండలంలోని పండితాపురం, తాళ్లగూడెం గ్రామాల్లో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మతల్లి మాలధారుల ఇరుముడి కార్యక్రమం గురుస్వాములు బొమ్మగాని సైదులు, కొమ్ము రామారావు ఆధ్వర్యాన అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మి తిరుపతమ్మతల్లి అమ్మవారి ఇరుముడి కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులకు గురుస్వామి పులిపాటి శ్రీనివాసరెడ్డి స్వామి ఇరుముడి కట్టారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, వల్లాల రాధాకృష్ణ, చెరువు స్వర్ణ, కోటేశ్వరరావు, నరసింహారావు, ఉపేందర్‌రెడ్డి, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలి


మాట్లాడుతున్న వెంగళరావు

ఖమ్మంసహకారనగర్: జిల్లాకు వచ్చిన స్పౌస్ ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు కోరారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏవీ నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఇటీవల జిల్లాకు 36 మంది స్పౌస్ ఉపాధ్యాయులు వచ్చారని, టీపీటీఎఫ్ ప్రాతినిధ్యం మేరకు ఈనెల 3న డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రారంభించారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, రాష్ట్ర కౌన్సిలర్ కేవీ.శ్యాంసుందర్, జిల్లా ఉపాధ్యక్షులు సంధ్యారాణి, జీవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న చిన్నారులు

ఖమ్మం మామిళ్లగూడెం: జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) అనుబంధ సంస్థ చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సీఐఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఫుడ్ ఫెస్టివల్ అలరించింది. తమ తల్లుల సహాయ సహకారాలతో పిల్లలు ఖర్జూరా, ఆలివ్, తేనె, పాలు, దానిమ్మ, అంజీర్, ద్రాక్ష, అరటి, వివిధ రకాల పండ్లు, డ్రై ఫ్రూట్లతో తయారు చేసిన భిన్న వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ కార్యదర్శి నస్రీన్ మాట్లాడుతూ... ఆరోగ్యకర ఆహార పదార్థాల విలువలను అలవర్చుకోవడం లక్ష్యంగా ఈ ఫుడ్ ఫెస్టివల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూరిఅప్సా, హాజీరా, షాజియ, ఫాతిమా, ఫైజా, సుమయ్యా పాల్గొన్నారు.

యాదగిరి స్ఫూర్తితో ఉద్యమించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అమరజీవి ఆచరణ వాది యాదగిరి స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాలను నిర్మించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ. ఝాన్సీ అన్నారు. పార్టీ విజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో యాదగిరి చిత్రపటానికి పూలేసి నివాళులర్పించారు. నాయకులు కంకణాల శ్రీనివాస్, పార్టీ వన్‌టౌన్ కార్యదర్శి లెనిన్, టూటౌన్ కార్యదర్శి సత్తార్మియా, నగర కార్యదర్శి ఎం.రవీందర్, లక్ష్మణ్, వెంకటేష్, లక్ష్మి, శ్రావణి, కంకణాల అరుణ, పృథ్వీ, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపూడిలో యాదన్న సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కెలోత్ లక్ష్మణ్, రామారావు, వెంకన్న, షేక్ మదర్ సాహెబ్, ఆదేపు సత్యం, ఇస్లావత్ రమేష్, కరికాల రామయ్య, కోనపుడి సుగుణ, శ్రీదేవి ఉన్నారు.

అయోడిన్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తిరుమలాయపాలెం: పిల్లల్లో అయోడిన్ లోపంపై వచ్చే వ్యాధులపై మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, కొక్కిరేణి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయోడిన్‌తో కలిగే ప్రయోజనాలను కళాకారులు ఆట, పాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నాగఫణి, అవుట్ రీచ్ వర్కర్ స్వప్న, కళాకారులు పుల్లారావు చంద్రమోహన్, సత్యనారాయణ, విజయ్, శాంతి అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

● ఫ్లై ఓవర్‌ను పరిశీలించిన అధికారులు
● ప్రమాద సూచికబోర్డులు, స్ట్రిప్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయం


వంతెనపై పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా ఖమ్మం- బోనకల్లు రోడ్డులో ధంసలాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతో స్థానికులు తొలినాళ్లలో హర్షం వ్యక్తం చేశారు. నిత్యం రైల్వేగేటు పడినప్పుడు ఎదుర్కొనే ఇక్కట్లు తీరినట్లేనని భావించారు. కానీ రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెన ప్రమాదాలకు నిలయంగా మారడంతో డేంజర్‌జోన్‌గా మారింది. ఆదివారం జరిగిన ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతుండడతో వంతెన డిజైన్‌పై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన ప్రమాదాలను అరికట్టేలా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యాన వివిధ శాఖల అధికారులు సోమవారం బ్రిడ్జిని పరిశీలించి ప్రమాదాలకు గల కారణం, మలుపు ఎంత మేర ఉంది, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపిస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రస్తుతానికి ప్రమాదాలను అరికట్టేలా వంతెనకు ఇరువైపులా ప్రమాద సూచిక బోర్డులు, వంతెనపై స్ట్రిప్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రమాదాలకు అధిక వేగంతో పాటు వంతెనపై మలుపులను అంచనా వేయడపోవడం కారణమని ప్రాథమికంగా గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈ జి.చంద్రశేఖర్, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.